ప్రోత్సహిస్తే విద్యార్థుల్లో పఠనాసక్తి

సైదాబాద్: బహుమతులు, పురస్కారాల వంటి ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ పరిధి కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ పాఠశాలలో ప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు, గత విద్యా సంవత్సరంలో పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వార్షిక బహుమతుల ప్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ స్నాతకోత్సవ దుస్తులు, టోపీలు ధరించి సందడి చేశారు. వారికి ప్రిన్సిపాల్ ప్రైమరీ తరగతులకు వెళ్లే అర్హత



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో ఝాన్సీ

పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.శంతన్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే నగరాభివృద్ధి



ఎల్‌బీనగర్ నుంచి కూకట్‌పల్లికి ప్రయాణిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఎల్‌బీనగర్: బీఆర్‌ఎస్ హయాంలో కోట్ల రూపాయలతో నగర అభివృద్ధి జరిగిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా గురువారం ఎల్‌బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు మేడ్చెల్, ఉప్పల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్ గుప్తా, ఎగ్గే మల్లేశం, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో కలిసి మెట్రోలో సుధీర్‌రెడ్డి ప్రయాణించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

భారీ మెజార్టీతో కేవీఆర్ గెలుపు ఖాయం

కొండా సంగీతారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఆయన సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్‌కే పురం, టెలిఫోన్ కాలనీలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీని, కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. విశ్వేశ్వర్‌రెడ్డి తన వ్యాపారాలన్నీ వదిలిపెట్టుకొని ప్రజాసేవ కోసం ముందుకు వచ్చిన మంచి మనిషి అని ప్రజల కీర్తించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మోదీ



ఆర్‌కేపురంలో ప్రచారంలో పాల్గొన్న కొండా సంగీతరెడ్డి

ఉన్నతమైన ఆర్థిక విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని సంగీతారెడ్డి చెప్పారు. ఈ ప్రచారంలో నేతలు అందాల శ్రీరాములు, రాధా ధీరజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వమే దేశానికి రక్ష: ఈటల



మోహన్‌నగర్‌లో రోడ్ షోలో మాట్లాడుతున్న బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల

నాగోలు: బీజేపీ ప్రభుత్వమే దేశానికి రక్ష అని, మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించుకుందామని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారంరాత్రి నాగోలు చౌరస్తా నుంచి మోహన్‌నగర్ చౌరస్తా వరకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజేందర్ మాట్లడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి అనేక సేవలు చేశారని, ఆయనను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మోదీ సారథ్యంలో భారత దేశ ఖ్యాతి నలుమూలలు పాకిందని, ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారంలో వచ్చే ఆస్కారం లేదని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేస్తే గంగలో వేసినట్టేనని అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు ఏం కావాలో నేరుగా నరేంద్ర మోదీ దగ్గరికి ధైర్యంగా వెళ్లి అడిగే సత్తా తనకే వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఈటల రాజేందర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

జలమండలి చల్లటి ఏర్పాటు

- మొదటిసారిగా చలివేంద్రాలు
- అందుబాటులో నాణ్యమైననీరు

చాదర్‌ఘాట్: మండే ఎండలకు జలమండలి అధికారులు చల్లటి నిర్ణయం తీసుకున్నారు. వాహనదారులు, పాదాచారులు, చిరు వ్యాపారుల దాహార్తి తీర్చేందుకుగానూ మలక్‌పేట డివిజన్ జలమండలి–1 అధికారులు నియోజకవర్గంలోని నాలుగు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

- రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చలివేంద్రాలలో ఏర్పాటు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్రీజర్‌లలో నీళ్లను అందుబాటులో ఉంచుతున్నారు.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 20 ట్యాంకర్ల నీటిని పంపిణీ చేస్తున్నారు.
- వాటి నిర్వాహణ కోసం ఒక్కో చలివేంద్రం వద్ద ఒక గార్డును ఏర్పాటు చేశారు.
- రోజుకు 20 ట్యాంకర్ల నీటిని ఈ చలివేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు.



చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న డీజీఎం షీలారాణి

- నాణ్యమైన చల్లటి నీటిని అందించేందుకు జలమండలి ముందుకు వచ్చింది. ఏప్రిల్‌లో మొదలైన ఈ చలివేంద్రాలు జూన్ నెలాఖరు వరకు అందుబాటులో ఉంటాయని జలమండలి డీజీఎం షీలా రాణి తెలిపారు.
- వీటి పర్యవేక్షణకు నిత్యం ఏఈలు, సెక్షన్ మేనేజర్‌లు లైన్‌మెన్‌లు తనిఖీలు నిర్వహిస్తారు.
- ప్రతీ కేంద్రంలోనూ స్టెయిన్‌లెస్ ఫ్రీజర్లు ఏర్పాటు చేశారు.



చలివేంద్రంలో మంచినీటి సరఫరా చేస్తున్న ఏఈ హష్మత్‌అలీ

చలివేంద్రాలు ఎక్కడెక్కడా...

మలక్‌పేట జలమండలి డివిజన్‌లో మలక్‌పేట పోలీస్ స్టేషన్ దగ్గర, రాఘవేంద్ర హోటల్ పక్కన, నల్లగొండ క్రాస్‌రోడ్ బస్టాప్, అక్బర్‌బాగ్ చౌరస్తా వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నామినేషన్ దాఖలు



మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న చామకూర రాజు

మన్సూరాబాద్: సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎల్‌బీనగర్‌లో ఆయన మాట్లాడుతూ మేడ్చల్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి గౌతం పోట్రుకు నామినేషన్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ కేవీగౌడ్, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఘోర శ్యామ్‌సుందర్‌గౌడ్, బీసీ ఉద్యమనేత విజేంద్ర పూలే తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ స్థానానికి బీజేపీ నేత సుభాష్‌చందర్జీ నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న సుభాష్‌చందర్జీ

సైదాబాద్: హైదరాబాద్ ఎంపీ స్థానం ఎన్నికల్లో బీజేపీ ప్రత్యామ్నాయ అభ్యర్థిగా జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, సీనియర్ నేత జి.సుభాష్‌చందర్జీ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్ ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ పార్టీ ప్రధాన అభ్యర్థి మాధవీలతనే అని, అయితే ఏదైనా అనివార్య కారణాల వల్ల నామినేషన్ తిరస్కరణకు గురైతే ప్రత్యామ్నాయంగా ఉండాలని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకే తాను నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు.

ఆరుగురి జీవితాల్లో వెలుగులు

- బ్రెయిన్ డెడ్ అయిన రైతు
- గ్రీన్‌చానల్ ద్వారా కిమ్స్ ఆసుపత్రికి గుండె తరలింపు
- జీవన్‌దాన్‌కు కిడ్నీలు, లివర్, కార్నియాల అందజేత

మన్సూరాబాద్: ఓ రైతు తాను మరణిస్తూ మరో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. జీవన్‌దాన్, కామినేని హాస్పిటల్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గుడ్డమల్లయ్యగూడెం గ్రామానికి చెందిన యారా యాదగిరి(43) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19న తెల్లవారుజామున బైక్‌పై వెళ్తుండగా ఓ కుక్క అడ్డురావటంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. ఆరు రోజుల పాటు చికిత్స అందించిన వైద్యులు బుధవారం రాత్రి బ్రెయిన్‌డెడ్ అయినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు యాదగిరి తండ్రి బుచ్చయ్య, భార్య సుశీలకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అవయవదానం చేయటానికి యాదగిరి కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో బుధవారం అర్ధరాత్రి పోలీసులు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి గుండెను ప్రత్యేక అంబులెన్స్‌లో సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను జీవన్‌దాన్‌కు అందజేశారు. అవసరమైనవారికి వీటిని ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చని, దీంతో మరో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వారు తెలిపారు.



యారా యాదగిరి(ఫైల్)

న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు

రంగారెడ్డి కోర్టులు: హైకోర్టు ఇటీవల వెలువరించిన ఉత్తర్వుల మేరకు జిల్లా కోర్టు నుంచి బదిలీపై వెళుతున్న కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి టి.నర్సిరెడ్డి, 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.భవానిచంద్ర, అదనపు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎన్.పంచాక్షరి, 1వ అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.మాధవీలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిరకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కోర్టు న్యాయవాద సంఘం కార్యదర్శి గులగారి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తుల సేవలను కొనియాడారు. కార్యక్రమానికి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా.పట్టాభి రామారావు, సంఘం అధ్యక్షుడు కొండల్ రెడ్డి, న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి సాయిరెడ్డి, న్యాయవాదుల మండలి సభ్యుడు ఆకుల అనంత్‌సేన్ రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు పాము రాజేందర్‌రెడ్డి, అశోక్ అందేకర్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రసాయనాలతో మామిడిని మాగబెడుతున్న ముగ్గురిపై కేసు

నాగోలు: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం కొత్తపేట పండ్ల మార్కెట్ ఏరియాలో తనిఖీలు నిర్వహించారు. మామిడికాయలను కృత్రిమంగా పండించేందుకు ఇథిలీన్, కార్బైడ్ ఉపయోగించి మాగబెడుతున్నారు. ఇలా పండించిన వాటిని విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని షేక్ ఖయ్యూమ్ ట్రేడింగ్ కంపెనీలో రూ.150 కేజీల స్టాక్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎస్‌బీ బనానా ఫ్రూట్ కంపెనీ, ఏబీసీ ఫ్రూట్ కంపెనీలో 200 కిలోల చొప్పున స్టాక్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసి నోటీసులు అందజేశారు. కార్బైడ్ ఉపయోగించి మాగబెట్టిన పండ్లు తింటే అనారోగ్యం తప్పదని అధికారులు పేర్కొంటున్నారు. కృత్రిమంగా మమిడి పండ్లను మాగ పెడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



కొత్తపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు

‘హోటళ్లపై చర్యలు తీసుకుంటాం’

మహేశ్వరం: పరిశుభ్రత, నాణ్యత పాటించని హోటళ్లపై జరిమానా విధించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి. వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి పక్కనున్న హోటళ్ల, టిఫిన్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పరిశుభ్రత పాటించని హోటళ్లకు నోటీసులు జారీ చేసి, జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న పలు హోటళ్ల, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించడం లేదన్నారు. వినియోగదారుల నుంచి తమకు పలు ఫిర్యాదులు అందాయన్నారు. కొన్ని హోటళ్లలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పురుగులు పడిన ఆహారం, నాణ్యతలేని నూనెలు, వంట సామగ్రితో వండి వినియోగదారులకు పెడుతున్నారన్నారు. మరోమారు ఇలా జరిగితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు పరిశుభ్రత పాటించని, వృత్తి వ్యాపార లైసెన్స్, లేబర్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ లేకుండా మాంసహారం ఫ్రీజ్‌ల్లో నిల్వ ఉంచి వాడుతున్న హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ‘నారాయణ’ విజయదుందుభి



దిల్‌సుఖ్‌నగర్: జేఈఈ మెయిన్స్–2024 ఆలిండియా ర్యాంకులతో దిల్‌సుఖ్‌నగర్ డే డివిజన్ నారాయణ కళాశాలలు విజయదుందుభి మోగించాయి. అన్ని కేటగిరీలలో కలిపి 500లోపు 11 మంది, 1,000లోపు ర్యాంకులు 18 మంది, 2,000 లోపు ర్యాంకులు 31 మంది విద్యార్థులు, 5000లోపు ర్యాంకులు 72 మంది విద్యార్థులు, 10,000లోపు ర్యాంకులు 120 విద్యార్థులు జాతీయస్థాయి, ర్యాంకులు సాధించడం గొప్ప విజయమని నారాయణ దిల్‌సుఖ్‌నగర్ డే డివిజన్ కోర్ డీన్ రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమంలో డీన్ అమరేందర్, డీజీఎం కెస్ రాజు, ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి మరియు ప్రిన్సిపాల్ జగదీష్, వీరయ్య, గోపాల్‌రెడ్డి, రమేష్, శేషుకుమార్, కళ్యాణి పాల్గొని విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు.

ఈత కొట్టేదెలా.. కొలను ఇలా!

- కోట్లాది రూపాయలతో స్విమ్మింగ్‌పూల్స్ నిర్మాణం
- వేసవి సెలవులు వచ్చినా తెరచుకోని వైనం
- నీటి కొరతే కారణమంటున్న అధికారులు
- విద్యార్థులు, యువతలో నిరుత్సాహం



నిరుపయోగంగా ఉన్న వనస్థలిపురం ఫేజ్–4లోని స్విమ్మింగ్‌పూల్

వనస్థలిపురం: ఈత కొలనులు ఉన్నాయి. కానీ, వాటిల్లో నీళ్లే లేవు. ఫలితంగా అవి నిరుపయోగంగా, అలంకారప్రాయంగా ఉన్నాయి. పాఠశాలలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించటంతో విద్యార్థులు వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సచివాలయ నగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నడిచే స్విమ్మింగ్ పూల్స్ నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు ప్రైవేటు స్విమ్మింగ్ పూల్స్‌లో ఫీజులు అధికంగా ఉండటంతో వాటి వైపు వెళ్లడానికి చాలామంది ఆసక్తి చూపడంలేదు. ఎక్కువగా జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణాలోపంతో జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్స్ ఏప్రిల్ నెల ముగుస్తున్నా ఇంకా తెరచుకో లేదు. దీంతో ఈత కొట్టేదెలా.. అని విద్యార్థులు, యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో వనస్థలిపురం ఫేజ్–4లో స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. 2022 సంవత్సరం డిసెంబర్ 6న అప్పటిమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దానిని ప్రారంభించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో రూ. 3 కోట్లకుపైగా వ్యయంతో మరో స్విమ్మింగ్‌పూల్ ప్రారంభమైంది. అనంతరం వీటి నిర్వహణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. గత ఏడాది ఈ పాటికి తెరచుకొన్న ఈత కొలనులు, ఈ సంవత్సరం ఏప్రిల్ నెల ముగుస్తున్నా తెరచుకోకపోవడంతో విద్యార్థులు, యువత నిరుత్సాహానికి గురవుతున్నారు. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈత కొలనులు అందుబాటులోకి వచ్చాయని ఆనందించేలోపే అవి నిరుపయోగంగా మారుతున్నాయని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో మూసివేసి ఉన్న స్విమ్మింగ్ పూల్

త్వరగా అందుబాటులోకి తెస్తాం...

సచివాలయనగర్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌కు సంబంధించి రెండు బోర్లు ఎండిపోవడంతో నీటి సమస్య వచ్చింది. స్విమ్మింగ్‌పూల్‌ను నీటితో నింపడానికి వాటర్ ట్యాంకర్లు తెప్పించడానికి పైనుంచి అనుమతులు వచ్చాయి. త్వరలో పూల్‌ను అందుబాటులోకి తెస్తాం. వనస్థలిపురం ఫేజ్–4లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరో 3, 4 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

–వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీ

‘ఇంటి వద్దకే ఓటు’ను సద్వినియోగం చేసుకోండి

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇంటి వద్ద ఓటు వేసే అర్హత ఉన్న వారు వృద్ధులు 3,722 మంది, వికలాంగులు 4,812 మంది ఉన్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందులో 179 మంది వృద్ధులు, 50 మంది వికలాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఫారం–12డి దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి తర్వాత 179 మంది వృద్ధులు, 34 మంది వికలాంగుల దరఖాస్తును ఆమోదించినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి మే 5, 6, 8 తేదీలలో ఎన్నికల సిబ్బంది ఇంటి వద్దనే ఓటును నమోదు చేసుకుంటారని తెలిపారు. మొత్తం 213 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్విమ్మింగ్ పూల్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి

ఎల్‌బీనగర్: వనస్థలిపురంలో నిరుపయోగంగా ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ఎల్‌బీనగర్ బీఎస్పీ ఇన్‌చార్జ్ జక్క యాదగిరి గురువారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను వృథాగా ఉంచారని అన్నారు. ఇప్పటికే కళాశాలలకు, పాఠశాలలకు సెలవులు ఇచ్చారని, ఆ విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా స్విమ్మింగ్ పూల్‌ను వాడుకలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



హయత్‌నగర్‌లో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

మన్సూరాబాద్: అంతర్జాతీయ మేడే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని కార్యాలయంలో గురువారం మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, ఏఐటీయూసీ సబ్ జిల్లా కమిటీ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు నిర్వహించి, కోల్పోయిన కార్మిక చట్టాలను తిరిగి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులకు ఉడిగం చేయాటానికి బీజేపీ ప్రభుత్వం 40 చట్టాలను 4 కోడ్‌లుగా చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

సీసీఎస్ బకాయిల విడుదలపై హర్షం

వనస్థలిపురం: తెలంగాణ ఆర్‌టీసీ కార్మికుల సీసీఎస్ బకాయిల నిమిత్తం ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేయడాన్ని ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ స్వాగతిస్తోందని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులు అనేకమంది రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారని, నిధుల లేమి కారణంగా సీసీఎస్ రుణాలు ఇవ్వలేకపోయిందని అన్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా రూ. 1000 కోట్లు రావలసి ఉందని అన్నారు. రిటైరైన ఉద్యోగులు వారి సెటిల్‌మెంట్ డబ్బును సీసీఎస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నారని, గత 7 నెలలుగా డిపాజిట్లపై వడ్డీ అందకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విడుదల చేసిన డబ్బులో రిటైరైన ఉద్యోగులకు రావలసిన వడ్డీ డబ్బులను వారికి జమ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థిని అదృశ్యం

సైదాబాద్: ఇంటర్ ఫలితాల్లో ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చింతల్‌బస్తీలో నివసించే కూలి అంగోతు వల్లి పెద్ద కూతురు దీపిక(16) ఇటీవల ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో ఆమె ఫెయిలైంది. దాంతో అదేరోజు మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. తండ్రి ఆమెకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆమె స్నేహితురాలికి ఫోన్ చేయగా దీపిక తనతో ఫెయిల్ అయ్యానని చెప్పి బాధపడిందని తెలిపింది. ఆమె కోసం చుట్టాలు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియ లేదు. దాంతో తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్‌లో తల్లీ ముగ్గురు పిల్లల అదృశ్యం

సైదాబాద్: పుట్టింటికని ముగ్గురు పిల్లలతో కలిసి బయలుదేరిన తల్లి అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంకేశ్వర బజార్‌లో నివసించే మొబైల్ టెక్నీషియన్ షేక్ ఇస్మాయిల్ భార్య మనీషా(28). వారికి ముగ్గురు సంతానం. ఈ నెల 22న తాను పిల్లలతో కలిసి కర్నూల్‌లోని పుట్టింటికి వెళుతున్నాని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. అదేరోజు సాయంత్రం ఇస్మాయిల్ కర్నూల్‌లోని మామగారికి ఫోన్ చేయగా అక్కడికి రాలేదని తెలిసింది. తమ కాలనీలోనే ఒకరితో చనువుగా ఉంటుందని, తనతో వెళ్లి ఉంటుందని ఇస్మాయిల్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. గతంలోనూ ఒకసారి ఇలానే వెళ్లి తిరిగి వచ్చిందని అతను పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజారులలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 15, వంకాయ 23, బెండ 35, పచ్చి మిర్చి 50, కాకర 35, బీర 40, క్యాబేజి 18, ఫ్రెంచి బీన్స్ 80, క్యారెట్ 37, దొండ 26–28, చిక్కుడు 45, గోకర 35, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, ఆలు 33, దోస 15, సార 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 37.

గమనిక: ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రారంభం



చాదర్‌ఘాట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పార్టీ హైదరాబాద్ అభ్యర్థి వలీ ఉల్లా సమీర్ – చాదర్‌ఘాట్